

నేడు శ్రీరంగంలో
'ముక్కోటి' ఉత్సవాల ప్రారంభం



శ్రీవిల్లిపుత్తూరు ఆలయంలో తిరుప్పావై ఉత్సవాల్లో పాల్గొన్న పీఠాధిపతులు, పుదుచ్చేరి మంత్రి నమశ్శివాయం తదితరులు



శ్రీరంగం ఆలయంలో ప్రత్యేక అలంకరణలతో శూడికొడుత్త నాచ్చియార్ సమేత రంగనాథ స్వామి

చెన్నై, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అష్టోత్తర శత వైష్ణవ దివ్య క్షేత్రాల్లో ప్రప్రథమ క్షేత్రంగా, భూలోక వైకుంఠంగా భాసిల్లుతున్న శ్రీరంగం రంగనాథస్వామి ఆలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు అత్యంత వైభవంగా ప్రారంభం కానున్నాయి. తిరునెడుతాండకం కార్యక్రమంలో ఉత్సవాలు ప్రారంభమవుతున్నాయి. ఈ ఉత్సవాల్లో మొదటి ఉత్సవమైన తిరుమొళి తిరువిళా మంగళవారం ఆరంభమవుతుంది. ఆ రోజు ఉదయం నంబెరుమాన్ మూలస్థానం నుంచి బయలుదేరి అర్జున మండపం చేరుకుంటారు. మధ్యాహ్నం 12 గంటల వరకు వైష్ణవపండితులు నంబెరుమాన్ ఎదుట నాలాయిర దివ్య ప్రబంధాన్ని పఠించనున్నారు. రాత్రి 7 కి అర్జున మండపం నుంచి నంబెరుమాన్ బయలుదేరి 9.45 గంటలకు మూలస్థానం చేరుకుంటారు. పగల్‌పత్తు తొలి రోజు నుంచి మూలవర్లు రంగనాథస్వామి ముత్తంగి సేవలో దర్శనమిస్తారు. ఈ ముత్తంగి సేవ 20 రోజులపాటు కొనసాగుతుంది. ఇదే విధంగా పగల్‌పత్తు ప్రతిరోజూ ఉత్సవర్లు నంబెరుమాళ్ వివిధ అలంకరణల్లో అర్జున మండపంలో భక్తులకు కనువిందు చేయనున్నారు. పగల్‌పత్తు ఉత్సవాల పదోరోజైన జనవరి 9న నంబెరుమాళ్ నాచ్చియార్ తిరుకోలమ్ (మోహిని అవతారం)తో దర్శనమివ్వనున్నారు. మరుసటి రోజు 10న రాపత్తు ఉత్సవాల మొదటి రోజు వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఆ రోజు వేకువజాము 4.15 గంటలకు నంబెరుమాళ్ మూలస్థానం నుండి బయలుదేరి 5.15 గంటలకు పరమపదవాసల్ (స్వర్గద్వారం) వద్ద వేంచేయనున్నారు. ఆరోజు రాత్రి 10 గంటల వరకు భక్తులకు స్వర్గద్వార ప్రవేశం కల్పిస్తారు. ఇదే విధంగా జనవరి 11 నుండి 15 వరకు పగలు ఒంటి గంట నుండి రాత్రి 8 గంటల వరకు, 16న సాయంత్రం 4 నుంచి రాత్రి 8.30 గంటల వరకు స్వర్గద్వారాన్ని తెరచి ఉంచుతారు. రాపత్తు ఎనిమదో రోజైన 17న స్వర్గ ద్వారం మూసివేస్తారు. ఆ తర్వాత 18న మధ్యాహ్నం ఒంటి గంట నుండి రాత్రి 8 గంటల వరకు, 19 ఉదయం 10.30 నుండి రాత్రి 8 వరకు భక్తులను స్వర్గద్వారంలో ప్రవేశించడానికి అనుమతిస్తారు. రాపత్తు ఏడో రోజైన జనవరి 16న నంబెరుమాళ్ తిరుకైత్తల్ సేవ, ఎనిమిదోరోజైన 17న తిరుమంగైమన్నన్ పరివేట ఉత్సవం, 10వ రోజైన 19న తీర్థవారి వేడుకలు జరుగుతాయి. 20న నమ్మాళ్వార్‌కు మోక్షాన్ని ప్రసాదించే వేడుకతో వైకుంఠ ఏకాదశి వేడుకలు ముగియనున్నాయి..

శ్రీవిల్లిపుత్తూరులో తిరుప్పావై మహానాడు...

ఇదిలా ఉండగా శ్రీవిల్లిపుత్తూరు ఆండాళ్ ఆలయంలో కోదైనాచ్చియార్ తొండర్ కుళమం (భక్తబృందం) ఆధ్వర్యంలో ఆరవ తిరుప్పావై మహానాడు ఆదివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా అమ్మవారికి సారె సమర్పణ కార్యక్రమం కూడా నిర్వహించారు. శ్రీవిల్లిపుత్తూరు మనవాళ మామునిగళ్ మఠం 24వ పీఠాధిపతి శఠగోప రామానుజ జీయర్, కొంగు మండలం నారాయణ రామానుజ జీయర్ స్వామి మంగళాశాసనాలతో మహానాడు ప్రారంభించారు. పుదుచ్చేరి హోంశాఖ మంత్రి నమశ్శివాయం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహానాడులో ఆండాళ్, తిరుప్పావై విశిష్టతలను వివరించేలా బీజేపీ జిల్లా అధ్యక్షుడు శరవణదురై రాజా, వేదబిరాన్ భట్టర్ సుదర్శన్, అరవింద్ కంటి ఆసుపత్రి డాక్టర్ పద్మావతి, నంబినారాయణన్ తదితరులు ప్రసంగించారు.

యూ ఆర్ డిస్మిస్...!
పరస్పరం తొలగింపు ఉత్తర్వులు

● తమిళ వర్సిటీలో వీసీ, రిజిస్ట్రార్ మధ్య ఆధిపత్య పోరు



తంజావూరు తమిళ విశ్వవిద్యాలయం





ఇన్‌ఛార్జి వీసీ శంకరన్, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ త్యాగరాజన్

టి.నగర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తంజావూరు తమిళ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వైస్‌ఛాన్సలర్, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఒకరినొకరు తొలగింపు ఉత్తర్వులు ఇచ్చుకుంటూ ఆ విశ్వవిద్యాల యం పాలనావ్యవహారాలను స్తంభింపజేస్తున్నారు. ఆ ఇద్దరు ఇన్‌ఛార్జుల నడుమ విశ్వవిద్యాలయం ఉద్యోగులంతా ఎవరి ఆదేశాల ప్రకారం నడుచుకోవాలో తెలియక నలిగిపోతున్నారు. ఈ విశ్వవిద్యాలయంలో 2017-18 సంవత్సరాల్లో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పోస్టుల్లో 40 మందిని అప్పటి వీసీ భాస్కరన్ నియమించారు. తగిన విద్యార్హతలు లేకుండానే వీరందరిని నియమించారనే వివాదాలు తలెత్తాయి. దానికి సంబంధించిన కేసు న్యాయస్థానంలో విచారణలో ఉంది. 2021లో ఈ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్‌గా వి.తిరువళ్ళువన్ అక్రమ పద్ధతుల్లో నియమితులైన ఆరోపణలు ఎదుర్కొంటున్న 40 మందినీ పర్మినెంట్ చేయడానికి సిండికేట్ అనుమతి పొందారు. దీనికి సంబంధించి విశ్వవిద్యాలయాల ఛాన్సలర్, రాష్ట్ర గవర్నర్ సంజాయిషీ కోరారు. అయితే వీసీ తిరువళ్ళువన్ సక్రమంగా సమాధానం, వివరణ గవర్నర్‌కు సమర్పించలేదని తెలుస్తోంది. దీనితో అక్టోబర్ 20న తిరువళ్ళువన్‌ను గవర్నర్ సస్పెండ్ చేశారు. అంతే కాకుండా రిటైర్డ్ జడ్జి జయచంద్రన్ నేతృత్వంలో కమిటీని నియమించి, ఆ విశ్వవిద్యాలయంలో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని కూడా గవర్నర్ ఆదేశాలిచ్చారు. ఆ తరువాత ఇండస్ట్రియల్ అండ్ జియోసైన్సెస్ ప్రొఫెసర్ కే శంకర్‌ను ఇన్‌ఛార్జి వైస్‌ఛాన్సలర్‌గా గవర్నర్ నియమించారు. ఆ నేపథ్యంలో ప్రొఫెసర్లు, సిబ్బంది, విద్యార్థుల మధ్య అసాధారణ పరిస్థితులు ఏర్పడేలా వ్యవహరిస్తున్నారని, విశ్వవిద్యాలయంలో శాంతి భద్రతల సమస్యలు కూడా తలెత్తే పరిస్థితులు కూడా కల్పిస్తున్నారని ఆరోపణలు చేస్తూ శంకర్‌ను వీసీ పదవి నుండి తొలగిస్తున్నట్లు ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా ఉన్న సి.త్యాగరాజన్ ఉత్తర్వు జారీ చేశారు. అంతటితో ఆగకుండా శంకర్‌కు సిండికేట్‌లో వీసీ ఇన్‌ఛార్జి కమిటీని నియమించేంతవరకూ, సిండికేట్ సభ్యుడు పి.భారతజ్యోతి వైస్‌ఛాన్సలర్ బాధ్యతలను నిర్వర్తిస్తారని కూడా ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. ఇదే విధంగా రిటైర్డ్ జడ్జి జయచంద్రన్ నేతృత్వంలోని విచారణ కమిటీ పరిధిలో ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ త్యాగరాజన్ ఉండటం వల్ల, పాలనా వ్యవహారాల సౌలభ్యం కోసం ఆయనను రిజిస్ట్రార్ పదవి నుండి డిస్మిస్ చేస్తున్నట్లు వైస్‌ఛాన్సలర్ శంకర్ కూడా ఉత్తర్వు జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు వెలువడేంత వరకు తమిళ విద్యావిభాగం సహాయాచార్యులు టి. వెట్రిసెల్వన్ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తారని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ విధంగా ఇద్దరూ పరస్పరం డిస్మిస్ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆ విశ్వవిద్యాలయం పాలనా వ్యవహారాలు పూర్తిగా స్తంభించాయి. ఈ పరిస్థితులలో ఆ ఇరువురూ జారీ చేసిన ఉత్తర్వులను నిలిపివేయాలని, విశ్వవిద్యాలయంలో మునుపటి పరిస్థితులే కొనసాగాలని తమిళభాషాభివృద్ధి విభాగం కార్యదర్శి ఉత్తర్వు జారీ చేసినట్లు ఆ విశ్వవిద్యాలయ ఉద్యోగులు చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికీ ప్రస్తుతం ఆ విశ్వవిద్యాలయంలో ఇన్‌ఛార్జి వైస్‌ఛాన్సలర్, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ మధ్య ఆధిపత్యం కోసం జరుగుతున్న ఈ ప్రచ్ఛన్న యుద్ధం ఇప్పట్లో సమసిపోయే పరిస్థితులు కనిపించడం లేదని ఉద్యోగులు, సిబ్బంది తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

నల్లకన్ను... అందరికీ ఆదర్శప్రాయుడు

● శతవసంత వేడుక సభలో సీఎం స్టాలిన్



కామ్రేడ్ నల్లకన్నును సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్టు నేత ఇరా నల్లకన్ను రాష్ట్రంలోని రాజకీయ పార్టీల నాయకులందరికీ ఆదర్శప్రాయుడని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ అన్నారు. స్థానిక కలైవానర్ అరగంలో ఆదివారం ఉదయం నుండి సాయంత్రం వరకు నల్లకన్ను శతవసంత వేడుకలు నిర్వహించారు. దీనిని స్టాలిన్ ప్రారంభించి ప్రసంగించారు. ముందుగా నల్లకన్నును సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కవితా సంపుటి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ ఈ శతవసంత వేడుకల్లో నల్లకన్ను ఆశీస్సులు అందుకోవడానికి వచ్చానని, పెరియార్, కరుణానిధి, అన్నాదురైకి లభించని అదృష్టం నల్లకణ్ణుకు దక్కిందని, శత సంవత్సరాలు తాను ఎంచుకున్న రాజకీయ మార్గంలో ఎటూ కదలకుండా పార్టీ కోసమే జీవితాన్ని అంకితం చేయడం సామాన్యమైన విషయం కాదన్నారు. వందేళ్ళు పూర్తి చేసుకుంటున్న కామ్రేడ్ నల్లకన్ను తమిళ సమాజాభివృద్ధికి మరింతగా పాటుపడాలన్నారు. కరుణానిధి కంటే యేడాది తక్కువ వయస్సున్న నల్లకన్నును ఆయన అన్నయ్యా అని ఆప్యాయంగా పిలిచేవారని చెప్పారు. గతంలో జరిగిన నల్లకన్ను 80వ జన్మదినవేడుకల్లో కరుణానిధి ప్రసంగిస్తూ కామ్రేడ్ తనకంటే చిన్నవాడైనా రాజకీయానుభవంలో తనకంటే సీనియర్ అని, అన్నయ్యలాంటి వాడని ప్రశంసించినట్లు చెప్పారు. కారు ప్రమాదంలో కరుణానిధి ఓ కంటికి దెబ్బతగిలి చూపు మందగించిందని, ఆ సంఘటనను గుర్తు చేస్తూ తనకు ఓ కన్ను మాత్రమే పోయిందని, రెండోకన్ను తన అంతర్ నేత్రంగా నల్లకన్ను అని చెప్పటం ఇద్దరి మధ్య గల రాజకీయాలకు అతీతమైన సన్నిహిత సంబంధాన్ని చాటుతుందని స్టాలిన్ చెప్పారు. నల్లకన్ను నిరాడంబరతకు నిలువెత్తు నిదర్శనమని, కరుణానిధి అంబేద్కర్ అవార్డు పేరుతో రూ.లక్ష నగదు బహుమతి ఇస్తే రూ.50వేలను పార్టీకి, మిగతా రూ.50 వేలను రైతుకూలీ సంఘానికి విరాళంగా ఇచ్చారని, తాను కూడా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నల్లకన్నుకు తగసాలై తమిళర్ అవార్డు పేరుతో రూ.10లక్షలు అందజేస్తే ఆ నగదుకు మరో రూ.5వేలు చేర్చి ముఖ్యమంత్రి సహాయ నిధికి పత్యేకించి వరదబాధితుల సహాయార్థం తిరిగిచ్చివేశారని స్టాలిన్ గుర్తు చేసుకున్నారు. ద్రావిడ సిద్ధాంతాలకు, సోషలిజానికి రాజకీయ స్నేహబంధంలో మధ్యలో కాస్త ఎడబాటు జరిగినా, ప్రస్తుతం వామపక్షాలు డీఎంకే మధ్య పటిష్ఠమైన రాజకీయ సన్నిహిత సంబంధాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ వేడుకలకు ప్రపంచ తమిళ సంఘాల సమాఖ్య అధ్యక్షుడు పి.నెడుమారన్ అధ్యక్షత వహించారు. సీపీఐ జాతీయ కమిటీ ప్రధాన కార్యదర్శి డి.రాజా, రాష్ట్ర కమిటీ కార్యదర్శి ముత్తరసన్, ఎండీఎంకే నేత వైగో, ప్రజా సంఘాల జాతీయ సమాఖ్య వ్యవస్థాపకులు మేధా పాట్కర్, మాజీ న్యాయమూర్తి చంద్రూ, ప్రముఖ సినీ గేయరచయిత వైరముత్తు, వీఐటీ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ విశ్వనాథన్, మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇరై అన్బు, ఒడిసా మాజీ ముఖ్యమంత్రి సలహాదారు బాలకృష్ణన్, మాజీ నగర మేయర్ సైదై దొరసామి, ఇస్రో మాజీ డైరెక్టర్ మయిల్‌సామి అన్నాదురై, రవికాశి ఆనందన్, కుశేలర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనే మా ధ్యేయం

● సీఎం స్టాలిన్

● తూత్తుకుడిలో మినీటైడల్ పార్కు ప్రారంభం





మినీ టైడల్ పార్కు ప్రారంభిస్తున్న సీఎం స్టాలిన్

చెన్నై, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను సమూలంగా రూపుమాపే దిశగా యువతకు ఉపాధి కల్పించేందుకే తమ ప్రభుత్వం టైడల్ పార్కులను ఏర్పాటు చేస్తోందని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. తూత్తుకుడిలో టైడల్ నియో పేరిట ఏర్పాటు చేసిన మినీ టైడల్ పార్కును ఆదివారం ఆయన ప్రారంభించారు. ఆ సందర్భంగా ఏర్పాటైన సభలో సీఎం ప్రసంగిస్తూ పట్టాభిరామ్ టైడల్ పార్కు, విల్లుపురం, తంజావూరు, సేలం, తూత్తుకుడి టైడల్ నియో పార్కుల ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు.

రాష్ట్రంలోని టైడల్ పార్కులు వేలాదిమంది యువతకు ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాయన్నారు. త్వరలోనే వేలూరు, తిరుప్పూరు, కారైక్కుడి ప్రాంతాల్లో కూడా టైడల్ పార్కులు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలను కల్పిస్తాయని ఆయన చెప్పారు. కార్యక్రమంలో తూత్తుకుడి ఎంపీ కనిమొళి, మంత్రులు గీతాజీవన్, అనితా రాధాకృష్ణన్, టీఆర్బీ రాజా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, ఎమ్మెల్యేలు వి.మార్కండేయన్, సి.షణ్ముగయ్యా, తూత్తుకుడి మేయర్ పి.జగన్, పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహక వాణిజ్య శాఖల కార్యదర్శి వి.అరుణ్‌రాయ్, టైడల్ నియో మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ నందూరి, తూత్తుకుడి కలెక్టర్ కె. ఇలంభగవత్, కార్పొరేషన్ కమిషనర్ మధుబాలన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నా వర్సిటీలో అత్యాచార ఘటనపై
నేడు మహిళా కమిషన్ విచారణ



చెన్నై, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నా విశ్వవిద్యాలయంలో విద్యార్థినిపై జరిగిన అత్యాచార సంఘటనపై జాతీయ మహిళా కమిషన్ సోమవారం విచారణ జరపనుంది. ఈ కమిషన్‌లో సభ్యులుగా ఉన్న మమతాకుమారి, ప్రవీణ్‌దీక్షిత్ ఈ విచారణ చేపట్టనున్నారు. వీరిలో ప్రవీణ్ దీక్షిత్ మహారాష్ట్ర మాజీ పోలీసు ఉన్నతాధికారి. ఈ అత్యాచార సంఘటనకు సంబంధించి జాతీయ మహిళా కమిషన్ ఇదివరకే పోలీసుల ఉదాసీన వైఖరిపై పలు ఆరోపణలు కూడా చేసింది. సోమవారం ఉదయం జాతీయ మహిళా కమిషన్ సభ్యులు అన్నా విశ్వవిద్యాలయానికి వెళ్లి అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులను విచారించనున్నారు. ఇదిలా ఉండగా అన్నా వర్శిటీలో బయటి వ్యక్తులు ఎవరూ ప్రవేశించకుండా కఠిన నిబంధనను అమలు చేయాలని భావిస్తున్నారు. ఈ విషయమై వర్శిటీ ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ వర్శిటీలో పనిచేస్తున్నవారు మాత్రమే లోపలకు వచ్చేలా నిబంధన అమలు చేయనున్నట్లు చెప్పారు.

16 మంది ప్రొఫెసర్లతో కమిటీ...

అన్నా విశ్వవిద్యాలయంలో విద్యార్థినులకు భద్రత కల్పించేందుకు 16 మంది ప్రొఫెసర్లతో ప్రత్యేక భద్రతా కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆదివారం ఆ విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు ప్రకటించారు. ఇప్పటికే ఆ విశ్వవిద్యాలయంలో భద్రత కోసం 140 మంది మాజీ సైనికులను సెక్యూరిటీలుగా నియమించారు. వీరితోపాటు మరో 40 మందిని అదనంగా నియమించాలని విశ్వవిద్యాలయ పాలకులు నిర్ణయించారు.

బాధితురాలికి రూ.25లక్షల నష్టపరిహారం...

ఇదిలా ఉండగా ఈ అత్యాచారానికి సంబంధించి ప్రాథమిక దర్యాప్తు నివేదిక (ఎఫ్ఐఆర్) వివరాలు బహిర్గతం కావటంపై మద్రాస్ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అంతేగాక ఈ కేసు విచారణ జరుగుతున్నప్పుడే చెన్నై నగర పోలీసు కమిషనర్ అరుణ్ మీడియా సమావేశంలో నిందితుడికి సంబంధించిన కీలక వివరాలు వెల్లడించడాన్ని సైతం హైకోర్టు తప్పుబట్టింది. ఆయనపై శాఖాపరమైన చర్యలకు సిఫారసు చేసింది. అదేవిధంగా బాధితురాలికి మధ్యంతర నష్టపరిహారంగా రూ.25 లక్షలు చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించడంతో పాటు ఈ ఘటనపై విచారణ జరిపేందుకు ముగ్గురు మహిళా ఐపీఎస్ అధికారులతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను కూడా నియమించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎస్ఎం సుబ్రమణ్యం, జస్టిస్ వి.లక్ష్మీనారాయణతో కూడిన ధర్మాసనం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

శ్రీపాద కథల శైలి, శిల్పం చాలా గొప్పవి

● బొడ్డపాటి చంద్రశేఖర్



వక్త చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న జేకే రెడ్డి, కందనూరు మధు



హాజరైన సాహితీ ప్రియులు

చెన్నై, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి కథల శైలి, శిల్పం పాఠకులను హత్తుకునేలా ఉంటాయని విజయవాడ విశ్రాంత ఆంగ్లోపన్యాసకులు బొడ్డపాటి చంద్రశేఖర్ అన్నారు. వేదవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహిక 156వ ప్రసంగం లో 'శ్రీపాద కథలు - గోదావరి గలగలలు' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. టి.నగర్‌లోని ఆంధ్రాక్లబ్ కృష్ణాహాలులో ఆదివారం సాయంత్రం ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ముందుగా వేదిక కార్యదర్శి కందనూరు మధు స్వాగతోపన్యాసం చేశారు. వేదిక అధ్యక్షులు జేకే రెడ్డి వక్తను సభకు పరిచయం చేశారు. వక్త బొడ్డపాటి చంద్రశేఖర్ ప్రసంగిస్తూ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గొప్ప కథకులని, 1915లోనే రచనా సంఘం ఏర్పాటు చేసి సాహితీ సేవలను విస్తరింపజేశారన్నారు. ఈ సందర్భంగా శ్రీపాద రచించిన 'ఇద్దరం అక్కడికే పోదాం', 'గులాబీ అత్తరు', 'వడ్లగింజలు' వంటి కథల్లోని ఇతివృత్తాన్ని, ఆనాటి సామాజిక పరిస్థితులను సోదాహరణంగా వివరించారు. శ్రీపాదవారి కథానికలు గోదారి నదిలా తేటతెల్లంగా ప్రవహించినట్లు చదువరులకు ఆసక్తి, ఉత్సుకతను కలిగిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్కా కోశాధికారి కె.రంగారెడ్డి, డాక్టర్ నందూరి విజయసారథి తదితరులు పాల్గొన్నారు.

సమాచార దర్శిని

రేపు పంచవటిలో హనుమాన్ జయంతి

ప్యారీస్, డిసెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి రాష్ట్రంలోని పంచవటిలో వెలసివున్న పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో సోమవారం హనుమాన్ జయంతి, సీతారామ కల్యాణం నిర్వహించనున్నారు. ఉదయం 2వేల లీటర్ల పాలతో క్షీరాభిషేకం, తిరుమంజనం, అనంతరం 1,500 కిలోల పుష్పాలతో 'పుష్ప యాగం' జరుగుతుంది. 36 అడుగుల పంచముఖ ఆంజనేయ స్వామికి 120 కిలోల ఏలకుల మాలతో అలంకరించనున్నారు. సాయంత్రం సీతారాముల కల్యాణం జరుగుతుం దని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

అక్షయ బాబా ఆలయంలో...

స్థానిక బ్రాడ్వే ఆచారప్పన్ వీధిలో ఉన్న అక్షయబాబా ఆలయంలో సోమవారం హనుమజ్జయంతి వేడుకలు జరుగనున్నాయి రామబంటుకు విశేష అభిషేకం, హనుమాన్ చాలీసా పారాయణం, వెన్నతో అలంకరణ, దీపారాధన ర్వహిస్తారు. భక్తులు పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాల్సిందిగా జై వాసవి సాయి ఛారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ అజంతా డా.కనిగెలుపుల శంకరరావు పిలుపునిచ్చారు.

ఎన్‌ఎస్సీ బోస్ రోడ్డులో...

భగవత్ భాగవత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో హనుమంత జయంతి వేడుకలు సోమవారం నిర్వహించనున్నారు. ప్యారీస్‌లోని చెన్నకేశవ పెరుమాళ్ దేవస్థానం నిర్వహణలో తెరెడి వీధిలో ఉన్న భక్త అభయ వరప్రద ఆంజనేయ స్వామి సన్నిధిలో ఉదయం తిరుమంజనం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం మహామంత్ర భజనమండలి కళాకారులచే భక్తి సంగీతం, మహిళా కోలాట ప్రదర్శన కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు.

రూ.24 కోట్లతో విక్టరీ మెమోరియల్ పునరుద్ధరణ

పెరంబూర్, డిసెంబరు 29: స్థానిక పూందమల్లిలో ఉన్న విక్టరీ మెమోరియల్‌ను రూ.24 కోట్ల పునరుద్ధరించనున్నారు. 1893 ఆంగ్లేయుల పాలనలో సైనికులు, గుర్రాలుండే గదులు, యుద్ధసామగ్రి భద్రపరిచేందుకు 5,500 చ.అ విస్తీర్ణంలో ఈ భవనాన్ని నిర్మించారు. మొదటి ప్రపంచ యుద్ధం విజయానికి చిహ్నంగా నిర్మించిన ఈ మెమోరియల్‌ను 1931లో అంధుల పాఠశాలగా మార్చగా, ప్రస్తుతం రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమ శాఖ పర్యవేక్షణలో ఉంది. 135 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ భవనాన్ని రూ.24.27 కోట్లతో పునరుద్ధరణ పనులు జనవరి 27వ తేది నుంచి ప్రారంభించనున్నట్లు ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

రేపు, ఎల్లుండి మెరీనాలో స్నానాలకు నిషేధం

పెరంబూర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా ఈ నెల 31, జనవరి 1వ తేదీల్లో మెరీనా సముద్రతీరంలో స్నానాలకు నిషేధం విధించారు. ఈ మేరకు గ్రేటర్ చెన్నై పోలీసు శాఖ విడుదల చేసిన ప్రకటనలో... 31వ తేది రాత్రి 9 నుంచి 1వ తేది వరకు మెరీనా స్నానాలకు నిషేధం విధించామన్నారు. ప్రజల భద్రత దృష్ట్యా ఈ చర్యలు చేపట్టినట్లు, ఆ సమయంలో పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

ఈ-సేవా కేంద్రాల్లో లైఫ్ సర్టిఫికెట్లు

పెరంబూర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఈ-సేవా కేంద్రాల ద్వారా లైఫ్ సర్టిఫికెట్లు పంపించాలని మాజీ ఉద్యోగులకు మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) తెలిపింది. ఈ మేరకు ఎంటీసీ మేనేజింగ్ డైరెక్టర్ అల్బీజాన్ వర్గీస్ విడుదల చేసిన ప్రకటనలో... రవాణా శాఖలో పనిచేస్తూ 1998 సెప్టెంబరు 1వ తేది నుంచి పదవీవిరమణ చేసిన, వీఆర్‌ఎస్ ఇచ్చిన, మృతిచెందిన ఉద్యోగులకు అందించే పింఛన్లకు సంబంధించి ప్రతి ఏటా జనవరి నుంచి లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాల్సి ఉందన్నారు. పింఛనర్ల వయస్సును పరిగణలోకి తీసుకొని, వారు కార్యాలయాలకు రాకుండా, ఈ-సేవా కేంద్రాల ద్వారా మార్చి 31వ తేదిలోపు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలని ప్రకటనలో తెలిపారు.

పొంగల్ ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పొంగల్ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు నడపాలని దక్షిణ రైల్వే నిర్ణయించింది. ఈ ప్రకారం, తాంబరం-తిరునల్వేలి-తాంబరం, తాంబరం-కన్నియాకుమారి, చెన్నై సెంట్రల్-నాగర్‌కోయిల్, చెన్నై సెంట్రల్-మానామదురై, ఎగ్మూర్-తిరుచ్చి మధ్య ప్రత్యేక రైళ్లు నడిపేందుకు రైల్వే శాఖకు సిఫార్సు చేశామని, మరో రెండు రోజుల్లో అధికారపూర్వకంగా ప్రత్యేక రైళ్ల వివరాలు తెలియజేస్తామని అధికారులు తెలిపారు.

4 వరకు మోస్తరు వర్షాలు

పెరంబూర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సోమవారం నుంచి జనవరి 4వ తేది వరకు మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. ఈ మేరకు వాతావరణ కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలోని ఒకటి, రెండు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. చెన్నైలో రానున్న 48 గంటల్లో ఆకాశం మేఘావృత్తంగా ఉంటూ, గరిష్ట ఉష్ణోగ్రత 30 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 24 డిగ్రీలుగా నమోదయ్యే అవకాశముందని, తెల్లవారుజామున మంచు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

కానరాని వసతులు.. కన్నీటి కష్టాలు

● కొట్టుమిట్టాడుతున్న చొక్కన్ అలై గ్రామస్తులు




చొక్కన్ అలై గ్రామంలో కూలడానికి సిద్ధంగా ఉన్న రేకుల ఇల్లు, అలంకార ప్రాయంగా మిగిలిన కరెంటు స్తంభాలు

టి.నగర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లాలో చొక్కన్ అలై అనే గ్రామంలో కనీస వసతులు లేక యాభై కుటుంబాలకు చెందిన బడుగుజీవులు బతుకుబండిని సాఫీగా నడపలేక కష్టాల సాగరాన్ని ఈదుతున్నారు. పెరియకుళం సొత్తుపారై సమీపంలో చుట్టూ పచ్చదనంతో కూడిన వాతావరణంలో చొక్కన్ అలై అనే కొండ గ్రామం ఉంది. ఈ గ్రామం బోడి (బోడినాయకనూర్) పంచాయతీ యూనియన్ అగమలై గ్రామపంచాయతీ పరిధిలో ఉంది. పట్టూరు, పట్టంపారై, సుకుందుకాడు, అలంకారం, మరుదైయూరు అంటూ కుగ్రామాలున్నాయి. ఇక్కడ నివశించేవారు కాఫీ, నిమ్మ, మిరియాలు పండిస్తున్నారు. ఈ గ్రామానికి సరైన రహదారి సౌకర్యాలు లేకపోవడంతో గిరిజనులకు బయటిప్రపంచంతో సంబంధాలు లేవు. సొత్తుపారై సమీపం కన్నన్‌కరై నుండి 2. కి.మీల దూరం కొండ మీదుగా నడిచి ఈ గ్రామానికి వెళుతుంటారు. ఈ గ్రామస్తులు యెన్నో యేళ్లుగా చేసిన విజ్ఞప్తుల మేరకు ఏడేళ్ళ క్రితం కన్నన్‌కరై నుండి నల్లరాలి రహదారి నిర్మించారు. అయితే ఆ రాళ్లను పేర్చడానికి నాశిరకం సిమెంట్ వాడటంతో ఆ రహదారి నిరుపయోగంగా మారింది. ఆ దారి నడవడానికే కాదు, సైకిళ్ల కూడా ఆ రహదారిలో వెళ్ల లేవు. ఇక ప్రస్తుత మొబైల్‌ఫోన్ల యుగంలో ఈ గ్రామానికి సెల్‌టవర్లు చాలా దూరంగా ఉన్నాయి. దీంతో ఈ గ్రామం నుండి సెల్‌ఫోన్‌లో సులువుగా మాట్లాడలేరు. ఏదో ఒక మొబైల్ సంస్థ కనెక్షన్ ఉన్నట్టుండి లభిస్తుంది. మాట్లాడుతుంటూ కట్ అవుతుంది. గత నాలుగేళ్ల క్రితం ఈ గ్రామంలో 34 మంది లబ్దిదారులకు గ్రీన్‌హౌస్ పథకం కింద ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. కానీ ఏ కారణం చేతనో అర్థాంతరంగా ఆగిపోయింది. ప్రస్తుతం అసంపూర్తిగా ఉన్న ఆ ఇళ్ళకు కరెంట్ కనెక్షన్లు కూడా లేవు. ఈ కొండగ్రామానికి వెళ్లటానికి టీచర్లు తీవ్ర ఇబ్బందులకు గురవటంతో గ్రామంలోని పాఠశాలను సైతం మూసి వేశారు. రహదారి సదుపాయం లేకపోవడంతో అధికారులు, రాజకీయ నాయకులు ఈ గ్రామం వైపు కన్నెత్తి కూడా చూడరు. దీంతో ఈ గ్రామస్థులు పడుతున్న కష్టాలు చెప్పనలవి కాదు. తమ బాధలను చెప్పుకునేందుకు ఈ గ్రామస్తులు పెరియకుళం, తేని మార్గంలో సుమారు 30 కి.మీల దూరం చుట్టుకుని వెళ్ళాలి. ఓ వినతి పత్రం ఇవ్వడానికి గంటల సమయం పడుతుంది. తమ గోడు ప్రభుత్వ దృష్టికి వెళ్ళాలంటే తమ గ్రామాన్ని పెరియకుళం పంచాయతీ యూనియన్‌లో విలీనం చేయాలని కోరుతున్నారు. ఓ వైపు అడవి జంతువుల బెడద, మరోవైపు విద్యుత్, రహదారి, విద్యా, వైద్య వంటి ప్రాథమిక సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై గ్రామపెద్ద సెల్వం మాట్లాడుతూ తమ గ్రామంలో 50 కుటుంబాలున్నాయని, వీరికి గ్రీన్‌హౌస్ పథకం కింద నిర్మించిన ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయని చెప్పారు. విద్యుత్ సదుపాయం లేదని, కనీసం రహదారి సదుపాయం కల్పించినా బాగుంటుందని చెప్పారు. రహదారిని నిర్మించకపోతే బయటిప్రపంచంతో సంబంధాలు లేకుండా బ్రతకటం కష్టమంటూ ఆ అమాయక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరి దుస్థితిని గమనించి ప్రాథమిక సదుపాయాలు కల్పించి బయటిప్రపంచంతో వారికి సంబంధాలు కలిగేలా పాలకులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



నిరుపయోగంగా రహదారి



అసంపూర్తిగా గ్రీన్‌హౌస్

జీయర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్‌లో ఆధ్యాత్మిక శోభ

● తిరుప్పావై సౌరభం...



సదస్సులో నిర్వాహకులు, ప్రవచన కర్తలు

ప్యారీస్, డిసెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): పవిత్ర ధనుర్మాస సందర్భంగా తిరుప్పావై విశిష్టతపై ఉపన్యాస కార్యక్రమం శ్రీవిల్లిపుత్తూరు తరహాలో జీయర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ (జెట్) చెన్నై ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. టి.నగర్‌లోని కోట శ్రీనివాసయ్య రామానుజ కూటం ఆడిటోరియంలో చినజీయ్యర్ స్వామి మంగళాశాసనాలతో తిరుప్పావై సదస్సు జెట్ చెన్నై అధ్యక్షులు పి.రవీంద్ర కుమార్ రెడ్డి అధ్యక్షతన ప్రారంభమైంది. ఈ సదస్సులో తిరుప్పావైలో శ్రీవైష్ణవం గురించి ప్రముఖ అధ్యాత్మిక ప్రవచన కర్తలు వేలుక్కుడి కృష్ణన్ స్వామి, డా. ఎంఏ వెంకట కృష్ణస్వామి, డాక్టర్ ఎంఏ మధుసూధన్ స్వామి, వేలుక్కుడి రంగనాథన్ స్వామి, అక్కరక్కని శ్రీనిధి స్వామి, లక్ష్మీనరసింహ భట్టర్ స్వామి, తిరుగోష్టియూర్ మాధవన్ స్వామి ప్రసంగించారు. శ్రీమద్ ఉభయ వేదాంతాచార్య పీఠం జీయ్యర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, చెన్నై సంయుక్త ఆధ్వర్యంలో సుదర్శనారిన్ సంఘ తమిళ మాలై పేరిట ధనుర్మాసం సందర్భంగా నిర్వహించిన ఈ సదస్సు ఏర్పాట్లను జీయ్యర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చెన్నై విభాగం కార్యవర్గ సభ్యులు పర్యవేక్షించారు.

మిత్రపక్షాలను గౌరవించడం లేదు




ఎంపీ కార్తీ చిదంబరం


ప్యారీస్, డిసెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): ఎవరు అధికారంలో ఉన్న మిత్రపక్షాలను గౌరవించడంలేదని కేంద్ర మాజీ ఆర్థికమంత్రి పి.చిదంబరం తనయుడు శివగంగ ఎంపీ కార్తీ చిదంబరం ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి వ్యవహారం, అన్నా వర్సిటీలో విద్యార్థులపై అత్యాచారం డీఎంకే ప్రభుత్వ వైఖరి, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సంకీర్ణ ప్రభుత్వ పనితీరు తదితర అంశాలపై కార్తీ చిదంబరం ఆదివారం మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహించే సమయంలో రాష్ట్రంలో డీఎంకే నేతృత్వంలో ఏర్పడే కూటమిలో కాంగ్రెస్ చేరడం తప్పనిసరైందని వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో విజయం సాధించాక అధికారం చేపట్టిన ప్రభుత్వంతో మిత్రపక్షాలకు ఎలాంటి సంబంధాలుండవని, దానికి కారణం అధికార పార్టీ మిత్రపక్షాలను ఉదాసీనతగా చూడటమేనన్నారు. బ్రిటీష్ పాలకుల హయాంలో రాజధాని నగరం చెన్నై నుంచి ఆంధ్ర రాష్ట్ర విజయవాడ వరకు ఉన్న కూవం నది కాలువలో పడవల రవాణా జరిగేదని, దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక అది పూర్తిగా కనుమరుగైపోయిందన్నారు. కూవం నదిలో పూడికతీత పనులను రూ.700 కోట్లతో పూర్తి చేసినట్లు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ప్రియ కౌన్సిల్ సమావేశంలో ప్రకటించారని, ఆ పనుల వివరాలు కోరుతూ తాను రాసిన లేఖకు ఇప్పటివరకు సమాధానం లేదన్నారు. ప్రజల తరుపున ఒక ఎంపీగా ఉన్న తనకు సమాధానం చెప్పకపోవడం విచారకరమన్నారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర కాంగ్రెస్ అధిష్టానం కూడా డీఎంకే ప్రభుత్వాన్ని నిలదీయడంలేదని చెప్పారు. ఈ రాష్ట్రంలో ప్రతిపక్షంగా, అధికార పార్టీగా వ్యవహరించలేక రెంటికీ చెడ్డ రేవడిలా కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఉందని కార్తీ చిదంబరం ఆందోళన వ్యక్తం చేశారు.

భర్త మృతదేహంతో ఐదు రోజులు..!

ఐసిఎఫ్, డిసెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): భర్త చనిపోయాడనే విషయం తెలియని మతిస్థిమితం లేని భార్య ఐదు రోజులుగా భర్త శవంతోనే గడిపిన ఘటన శివగంగ జిల్లాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే శివగంగ జిల్లా, తిరుప్పూర్ కళ్లకూచి వీధికి చెందిన ఆదిరత్నమూర్తి (62) తిరుప్పూర్ ప్రభుత్వ కళాశాలలో పని చేస్తూ రిటైర్డ్ అయ్యాడు. ఇతని భార్య పరిమళం (56) వీరికి పిల్లలు లేరు. ఈ క్రమంలో ఆది రత్నమూర్తికి గత కొంత కాలంగా అనారోగ్యపాలవటంతో మతిస్థిమితం లేని తన భార్యతో కలిసి ఇంట్లోనే ఉండేవారు. శనివారం ఉదయం ఇంట్లో నుండి దుర్వాసన రావటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించటంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తలుపు తట్టగా ఎలాంటి చలనం లేకపోవటంతో తలుపులు బద్దలుకొట్టి ఇంట్లోకి వెళ్లి చూడగా ఆదిరత్నమూర్తి మంచంపై విగతజీవి ఉండగా, అతని భార్య పరిమళం పక్కనే కూర్చొని నా భర్త పడుకొని ఉన్నాడు. ఎవరు నిద్రలేపొద్దని అరుస్తుండటంతో పోలీసులు ఆదిరత్నమూర్తి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.



తూత్తుకుడి పర్యటనకు వెళ్తూ మార్గమధ్యంలో ఓ పసిబిడ్డను ఎత్తుకున్న సీఎం స్టాలిన్



చెన్నైలోని దేవాదాయశాఖ కార్యాలయంలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు

నూతన సంవత్సరంలో అంతా శుభాలే జరగాలి

● వామ్ గ్లోబల్ అధ్యక్షుడు తంగుటూరి రామకృష్ణ



వేడుకల్లో ప్రసంగిస్తున్న తంగుటూరి రామకృష్ణ

ప్యారీస్, డిసెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరంలో అంతా శుభాలే చేకూరాలని, ప్రతి ఒక్కరి జీవితంలో సంతోషాలు వెల్లివిరియాలని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ (వామ్) గ్లోబల్ అధ్యక్షులు తంగుటూరి రామకృష్ణ ఆకాంక్షించారు. వామ్ గ్రేటర్ చెన్నై విభాగం ఆధ్వర్యంలో 2025వ సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ వామ్ మహిళా విభాగం నేతృత్వంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. చూలైమేడులోని వామ్ ప్రధాన కార్యాలయంలో ఆదివారం వినాయక పూజతో కొత్త సంవత్సర వేడుకలు ప్రారంభించారు. ఈ వేడుకల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొని ఆట, పాటలు, తంబోలా, లక్కీడిప్, నృత్యాలతో సందడి చేశారు. మహిళా విభాగ అధ్యక్షురాలు శ్రీలత అధ్వర్యంలో వామ్ గ్లోబల్ ఫస్ట్ లేడీ తంగుటూరి రమాదేవితో పాటు మహిళా విభాగం సెక్రెటరీ అరుణకుమారి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో అనేకమంది కొత్త సభ్యత్వం తీసుకున్నారు. అతిధులుగా తంగుటూరి రామకృష్ణ, గ్రేటర్ చెన్నై విభాగ సభ్యులు బెల్లంకొండ సాంబశివరావు, వామ్ సీనియర్ సిటిజన్ ఫారంకు చెందిన జి.రాధాకృష్ణ, ముద్ర రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు. అలాగే గ్రేటర్ చెన్నైలో కొత్తగా చెట్‌పేట్ విభాగాన్ని ప్రారంభించారు. దీనికి అధ్యక్షులుగా నియమితులైన జగదీష్ సింహం, విగ్నేష్ (కార్యదర్శి), సత్యన్నారాయణ (ట్రెజరర్)చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ 2025 నూతన సంవత్సరంలో సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ప్రజలంతా జీవించాలని, కులమత బేదాలు, యుద్ధాలు లేని దేశాలుగా ఉండాలని ఆకాంక్షిస్తూ తెలుగు వారందరికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

నగల చోరీ: ముగ్గురి అరెస్ట్

ప్యారీస్, డిసెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): రాణిపేట జిల్లాలో ఓ ఇంట్లో నగలు దోచుకున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే నెమిలి ప్రాంతానికి చెందిన మోహన్‌రాజ్ అనే రిటైర్డ్ వీఏఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. శనివారం తన కుమారుడి ఇంటికి వెళ్లిన మోహన్‌రాజ్ సాయంత్రం తిరిగొచ్చి గేటుకున్న తాళం పగలగొట్టివుండటంతో వెంటనే లోనికి వెళ్లి చూడగా బీరువా ధ్వంసం చేసి అందులోని 11 సవర్ల నగలు, 1,250 గ్రాముల వెండి చోరీకి గురికావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై నెమిలి ప్రాంత పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి, దగ్గరలోని సీసీ పుటేజీ ఆధారంగా విచారణ చేపట్టి కావేరిపాక్కంకు చెందిన సూర్య అనే యువకుడిని అదుపులోకి తీసుకొని, అతడికి సహకరించిన మరో ఇద్దరిని కూడా అరెస్టు చేశారు.

ఆటో బోల్తా : ఐదుగురికి గాయాలు

ఐసిఎఫ్, డిసెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): ఆటోబోల్తా పడిన ప్రమాదంలో ఐదుగురు గాయాలపాలైన ఘటన పులియాన్‌తోపు, ఒట్టేరి వంతెన వద్ద జరిగింది. పులియాన్‌తోపు నటేశన్ నగర్‌కు చెందిన భాస్కర్ (48) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఉదయం ఐదుగురు ప్రయాణికులతో పులియాన్‌తోపు నుండి మేట్టుపాళెం వైపు వెళుతుండగా ఆటో ఓట్టేరి వంతెన వద్ద మరో ఆటోను ఓవర్‌టేకింగ్ చేస్తున్న క్రమంలో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఏగవల్లి (47), సత్య (33), కోకిల (47), పద్మావతి (55), శకుంతల (57)లు తీవ్రంగా గాయపడ్డారు. చుట్టు ప్రక్కల వారు గాయపడిన వారిని దగ్గరలో ఉన్న ఓ ప్రవేటు వైద్యశాలకు తరలించారు. సమాచారమందుకున్న పులియాన్‌తోపు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు 1,363 బస్టాండ్లలో స్వచ్ఛభారత్

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరం, శివారు ప్రాంతాల్లోని 1,363 బస్టాండ్లలో సోమవారం స్వచ్ఛభారత్ చేపట్టనున్నట్లు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) తెలిపింది. నగరాన్ని శుభ్రంగా ఉంచేలా జీసీసీ పలు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా తొలి విడతగా ఆగస్టు 21వ తేది నగరవ్యాప్తంగా స్వచ్ఛభారత్ పనులు చేపట్టి, చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలు సేకరించడంతో పాటు వాల్‌పోస్టర్లు, ప్రకటన బోర్డులు తొలగించారు. ఈ నేపథ్యంలో, రెండో విడతగా జీసీసీ పరిధిలోని 15 మండలాల్లో ఉన్న 1,363 బస్టాండ్‌లో సోమవారం ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు స్వచ్ఛభారత్ చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

వృద్ధురాలి హత్య.. నగల దోపిడీ

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలిని హతమార్చి 5 సవర్ల నగలు కాజేసిన ఇద్దరు బాలురను పోలీసులు అరెస్ట్ చేశారు. విరుదునగర్ జిల్లా పందల్‌కుడి గ్రామానికి చెందిన సుబ్బులక్ష్మి (67) కుమారులు, కుమార్తెలకు వివాహమై వేరే ప్రాంతాల్లో ఉన్న ఉండడంతో ఒంటరిగా నివసిస్తోంది. ఈ నేపథ్యంలో, శుక్రవారం రాత్రి ఇంట్లో ప్రవేశించిన ఇద్దరు బాలురు ఆ వృద్ధురాలిని హతమార్చి 5 సవర్ల నగలు దోచుకొని పరారయ్యారు. కేసు నమోదుచేసిన పోలీసులు, ఇద్దరిని అరెస్ట్ చేసి జువెనల్ హోంకు తరలించారు.

ఇంతకీ ఆ సార్ ఎవరు?

● ఈపీఎస్ ఫొటోతో పోస్టర్ల కలకలం



కరూరులో గోడలపై అతికించిన పోస్టర్లు

ప్యారీస్, డిసెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండీలోని అన్నా వర్సిటీలో విద్యార్థినిపై జరిగిన అత్యాచారాన్ని ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఇంతకీ ఆ సార్ ఎవరు? అని ప్రశ్నిస్తూ ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే తరఫున అంటించిన పోస్టర్ అందరిని ఆకట్టుకుంటోంది. ఇంజనీరింగ్ విద్యార్థినిపై అత్యాచార ఘటన రాష్ట్రంలో కలకలం రేపింది. ఘటన జరిగిన రోజు జ్ఞానశేఖరన్ సెల్‌ఫోన్‌కు ఒక కాల్ రావటంతో అతడు ఎవరితోనూ నిర్విరామంగా మాట్లాడుతూ 'సార్... సార్.. ' అని మాట్లాడే వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయింది.. దీంతో నిందితుడు ఫోన్‌లో సార్ సార్ అంటూ మాట్లాడిన వ్యక్తి ఎవరో కనుగొనాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలోనే ఆదివారం రాష్ట్రమంతటా ఇంతకీ ఆ సార్ ఎవరు? అనే నినాదంతో ముద్రించిన పోస్టర్లు కలకలం రేపుతున్నాయి.

3న తంజావూరులో అన్నాడీఎంకే ధర్నా

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లా పేరావూరణి మున్సిపాలిటీలో అవినీతి, ప్రతినిధులు, అధికారుల నిరంకుశత్వాన్ని వ్యతిరేకిస్తూ అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టనున్నారు. జనవరి 3వ తేది ఉదయం మాజీ మంత్రి కామరాజ్ నేతృత్వంలో ఆందోళన జరుగుతుందని ఈపీఎస్ ప్రకటించారు.

బైకును ఢీకొన్న లారీ : మహిళ మృతి

ఐసిఎఫ్, డిసెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): బైకును లారీ ఢీకొనడంతో ఓ ప్రవేటు కంపెనీలో పనిచేస్తున్న మహిళ మృతిచెందిన ఘటన షోలింగనల్లూర్‌లో చోటుచేసుకుంది. వివరాల్లో వెళ్తే తేని జిల్లా ప్రాంతానికి చెందిన మలర్ విళ్లీ (22) కేళంబాక్కంలోని లేడీస్ హాస్టల్‌లో ఉంటూ ఉద్యోగం చేస్తుంది. మలర్‌విళ్లీ క్రిస్మస్ సందర్భంగా తన సొంతూరు వెళ్లి తిరిగి చెన్నై వచ్చి శనివారం తెల్లవారుజామున కోయంబేడు బస్టాండ్‌లో బస్సు దిగింది. తిరువొత్తియూర్ ప్రాంతానికి చెందిన స్నేహితుడు సంతోష్‌తో కలిసి కోయంబేడు నుంచి ఇద్దరు బైకుపై వెళ్తూ షోలింగనల్లూర్ ట్రాఫిక్ సిగ్నల్ వద్దకు రాగా వెనుక నుంచి వచ్చిన లారీ బైకు వెనుక వైపు ఢీకొనడంతో మలర్‌వళ్లీ లారీ వెనుక చక్రాల కిందపడి ఘటనా స్థలంలోనే మృతిచెందగా బైక్ నడుపుతున్న సంతోష్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. లారీ డ్రైవర్ పశ్చిమ బెంగాల్‌కు చెందిన హమీతుల్లా పరారీలో ఉన్నట్లు సమాచారం.

మహిళల జిమ్‌కు శంకుస్థాపన

ఐసిఎఫ్, డిసెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): చెన్నై కార్పొరేషన్ 38వ వార్డులోని పటేల్‌నగర్‌లో సుమారు రూ.30 లక్షలతో మహిళలకు ప్రత్యేక జిమ్ ఏర్పాటు చేయనున్నారు. ఈ జిమ్ నిర్మాణం పూర్తైన వెంటనే ఉదయం, సాయంత్రం వేళల్లో మహిళలకు అందుబాటులో ఉంటుందని మేయర్ ప్రియా రాజన్ తెలిపారు. ఆదివారం జరిగిన జిమ్ శంకుస్థాపన కార్యక్రమంలో శాసన సభ్యుడు ఎబినేజర్, జోనల్ కమిటీ చైర్మెన్ నేతాజీ గణేష్, కార్పొరేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పీఎంకే పదవి స్వీకరించను: ముకుందన్

ప్యారీస్, డిసెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) యువజన విభాగం అధ్యక్ష పదవి స్వీకరించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పిన ముకుందన్ పార్టీ సాధారణ సభ్యుడిగా ఉంటానని ప్రకటించారు. పీఎంకే అధినేత డాక్టర్ రాందాస్, ఆయన కుమారుడు, ఆ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి మధ్య పార్టీ పదవుల కేటాయింపు విషయంలో విబేదాలు చోటుచేసుకున్నాయి. పుదుచ్చేరిలో శనివారం జరిగిన పీఎంకే సర్వసభ్య మండలి సమావేశంలో పీఎంకే యువజన విభాగం అధ్యక్షుడిగా ముకుందన్ పరుశురామన్‌ను నియమిస్తున్నట్లు రాందాస్ ప్రకటించారు. దీంతో అన్బుమణి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, ఆదివారం మీడియాతో మాట్లాడిన ముకుందన్ పీఎంకే యువజన విభాగ అధ్యక్షపదవి చేపట్టేందుకు అభ్యంతరం తెలిపారు.

33 శాతం అధిక వర్షపాతం

పెరంబూర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలతో రాష్ట్రంలో 33 శాతం అధిక వర్షపాతం నమోదైంది. నాగపట్టణం జిల్లాల్లో అత్యధికంగా 1,187 మి.మీ వర్షం కురిసింది. చెన్నైలో 1,076 మి.మీ వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు అక్టోబరు 1న ప్రారంభమై డిసెంబరు 28వ తేది వరకు కొనసాగుతుండగా, సరాసరి వర్షపాతం 438.9 మి.మీ కాగా, ప్రస్తుత సంవత్సరం 585.1 మి.మీ వర్షపాతం అని 33 శాతం అధికంగా నమోదైందని వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది.

22న అసిస్టెంట్ కేస్ మేనేజర్ రీ ఎగ్జామినేషన్

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అసిస్టెంట్ కేస్ మేనేజర్ రీ ఎగ్జామినేషన్ ఫిబ్రవరి 22న జరుగుతుందని టీఎన్‌పీఎస్సీ ప్రకటించింది. ఈ నెల 14న నిర్వహించిన ఈ పరీక్షను సాంకేతికలోపం కారణంగా రద్దు చేశారు. రద్దు చేసిన పరీక్షను ఫిబ్రవరి 22వ తేది నిర్వహించనున్నట్లు, గతంలో పరీక్షకు హాజరుకాని అభ్యర్థులు కూడా ఈ పరీక్షకు హాజరుకావచ్చని టీఎన్‌పీఎస్సీ తెలిపింది.

చెయ్యారు సిప్కాట్‌లో జర్మన్ కర్మాగారం

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): చెయ్యారు సిప్కాట్‌లో జర్మన్ దేశానికి చెందిన మేజర్ షాంకింగ్ షట్టర్ కంపెనీ ఫాక్టరీ ఏర్పాటు చేయనుంది. 57 ఎకరాల విస్తీర్ణంలో రూ.600 కోట్లతో చేపడుతున్న ఈ కర్మాగారం ద్వారా వెయ్యి మందికి ఉపాధి లభించనుంది. ఇప్పటికే ఈ కంపెనీ శ్రీపెరుంబుదూర్‌లో నాలుగు ఫ్యాక్టరీలు నిర్వహిస్తోంది.

అలరించిన సంక్రాంతి సంబరాలు



తెలుగు క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న గూడపాటి జగన్మోహన్ రావు, పీఆర్ కేశవులు తదితరులు

ప్యారీస్, డిసెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలోని చెన్నై కాపు సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. జానపదగేయాలు, ముగ్గులు, వంటలపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రముఖుల ప్రసంగాలతో ఈ వేడుకలు సందడిగా సాగాయి. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పెరంబూర్ లోని డీఆర్‌బీసీసీ పాఠశాల ఆడిటోరియంలో సమితి అధ్యక్షుడు గూడపాటి జగన్మోహన్ రావు అధ్యక్షతన ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన ఈ సంబరాల్లో తెలుగుదనం ఉట్టిపడింది. 2025 సంక్రాంతి సంబరాలను ఆహ్వానిస్తూ నిర్వహించిన ఈ వేడుకలకు సమితి కార్యదర్శి పీఆర్ కేశవులు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే తెలుగు కాలెండర్‌ను ఆవిష్కరించి సభ్యులందరికీ అందజేశారు. ఈ వేడుకలకు నగరంలో నితెలుగు వారంతా హాజరయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళల మృతి

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లాలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు మృతిచెందారు. గుమ్మిడిపూండిలోని ఓ ప్రైవేటు పాఠశాల వ్యానులో సహాయకులుగా పనిచేస్తున్న సోంబట్టు గ్రామానికి చెందిన నందిని, కవరపేటకు చెందిన విజయ శనివారం విధులు ముగించుకొని ద్విచక్రవాహనంపై బయల్దేరారు. టిప్పర్ లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో, నందిని, విజయ తీవ్ర గాయాలతో సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. కేసు నమోదుచేసిన పోలీసులు, టిప్పర్ లారీ డ్రైవర్ ముత్తుకృష్ణన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

2024 విషాదం మిగిల్చిన

అఘాయిత్యాలు...

అదుపులో లేని నేరాలు

రాష్ట్ర ప్రజానీకానికి 2024వ సంవత్సరం తీరని విషాదాన్నే కలిగించింది. నేరాలు, ఘోరాలు అధికమయ్యాయి. దోపిడీలు, మహిళలపై లైంగిక వేధింపులు, హత్యలతో పాటు ఈ యేడాది కళ్లకుర్చి కల్తీ సారా సంఘటన, యేడాది చివర ఫెంగల్ తుఫాన్ ప్రజలను శోకసంద్రంలోకి నెట్టింది. రాష్ట్రంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, అమ్మకాలు కూడా అధికమవుతున్నాయి. మాదక ద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న పాలకులు చెబుతున్న మాటలు ఆచరణకు నోచుకోవటం లేదు. మేలిరకం గంజాయి, విదేశీ మాదక ద్రవ్యాలు యువతకు ప్రత్యేకించి విద్యార్థులకు అందుబాటులోకి రావటంతో మత్తులో జోగుతున్నారు. ఈ యేడాది హత్యకేసు, అత్యాచారం కేసు నిందితులు, పేరుమోసిన రౌడీలను పోలీసులు అరెస్టు చేసిన మరుసటి రోజూ వారంతా పోలీసు స్టేషన్లలోని బాత్రూమ్‌లలో జారిపడి కాళ్ళు, చేతులను విరగ్గొట్టుకోవడం ఆనవాయితీ మారింది. అన్నా వర్శిటీ విద్యార్థిని అత్యాచారం కేసు విచారణ జరుపుతున్న హైకోర్టు ధర్మాసనం కూడా ఆ సంగతి ప్రస్తావిస్తూ 'ఆ పిండి కట్ల జోలికి మేం వెళ్లబోము' అంటూ హాస్యాస్పదంగా పేర్కొన్న విషయం తెలిసిందే.

- పెరంబూరు, ఆంధ్రజ్యోతి

జనవరి

కొత్త సంవత్సరం ఆరంభంలో ఓ ఇంట విషాదం చోటుచేసుకుంది. తిరుచ్చి జిల్లా అరియమంగళం కీళఅంబికాపురానికి చెందిన ఆటో డ్రైవర్ మారిముత్తు తిరుచ్చిలో తల్లి శాంతి (70), భార్య విజయలక్ష్మి (38), కుమార్తెలు ప్రదీప (12), హరిణి (10) ఇంట్లో నిద్రిస్తుండగా, ఇంటి పైకప్పు హఠాత్తుగా కూలిపడింది. ఆ ఘటనలో బాలికల సహా మహిళలు మృతిచెందారు.


ఆరుగురిని బలితీసుకున్న కారు

- పుదుచ్చేరి బీచ్‌లో ఒక విద్యార్థి, మరొక యువకుడి మృతదేహాలు తీరానికి కొట్టుకొచ్చాయి. నీలగిరి జిల్లా పందలూరు సమీపం ఏలమన్నా తేయాకు తోటలో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన కార్మిక దంపతుల కుమార్తె నాన్సీ (3)పై చిరుతపులి దాడి జరిపింది. ఆస్పత్రిలో చికిత్స ఫలించక మృతి చెందింది.
- మదురై, పుదుకోట ప్రాంతాల్లో జల్లికట్టు ఎద్దులు కుమ్మి ఇద్దరు యువకులు మృత్యువాతపడ్డారు. జర్మనీలో ఉద్యోగం చేస్తున్న భార్యకు రిజిస్టర్ పోస్ట్‌లో తలాక్ చెప్పిన భర్త నాజర్ షెరీఫ్‌ను, అతడి తండ్రిని పోలీసులు అరెస్టు చేశారు. కాంచీపురం వరదరాజస్వామివారి ఆలయ వేడుకల్లో వడకలై, తెన్‌కలై వర్గానికి చెందిన బ్రాహ్మణులు ప్రభంధం గానం చేసే విషయమై గొడవపడ్డారు. చివరగా రెండు వర్గాలకు చెందిన పండితులు ముష్టి యుద్ధానికి పాల్పడ్డారు.
- స్థానిక షేనాయ్‌నగర్ మెట్రో రైల్వేస్టేషన్ సమీపంలో రూ.5 కోట్ల విలువైన కొకైన్ స్వాధీనం చేసుకొని నైజీరియాకు చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. నైజీరియా దేశానికి చెందిన సింట్‌ఒనర్బి స్నేహితుడు సియోన్ కోయంబేడు బస్ టెర్మినల్ ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరిస్తుండగా అదుపులోకి తీసుకొని, రూ.5 కోట్ల విలువైన 1.120 గ్రాముల కొకైన్, రూ.5 లక్షల నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. విరుదాచలం సమీపం వచ్చకారపట్టిలో పనిచేస్తున్న ఓ బాణాసంచా కర్మాగారంలో సంభవించిన పేలుడు ఘటనలో ఇద్దరు కార్మికులు మృతిచెందారు.
- అదే విధంగా ఇంట్లో పనిచేస్తున్న బాలికపై డీఎంకే ఎమ్మెల్యే కరుణానిధి కుమారుడు ఆండ్రో మదివానన్, కోడలు మెర్లినా దాడిచేయడంతో తీవ్రగాయాలయ్యాయి. తెన్‌కాశి సమీపంలో కారును సిమెంట్ బస్తాల లోడు లారీ ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురు మృతిచెందారు. కర్నాటక రాష్ట్రం బళ్లారి నుంచి కేరళ రాష్ట్రానికి సిమెంటు బస్తాలలోడుతో వేగంగా వచ్చిన లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు కాగా, అందులో ప్రయాణించిన ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు.

ఫిబ్రవరి

- కన్నియాకుమారి జిల్లా ఇడైకాడు పల్లందేరికి చెందిన జౌళి వ్యాపారి గోపాలకృష్ణన్ కుమార్తె రోహిణి (27) చైనాలో వైద్య విద్య అభ్యసిస్తున్న నేపథ్యంలో జనవరి 12న మృతిచెందింది. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ చొరవతో చైనా నుంచి 51 రోజుల అనంతరం మృతదేహాన్ని తీసుకొచ్చి, స్వగ్రామంలోఅంత్యక్రియలు నిర్వహించారు.
- దిండివనం సమీపం మయిలం ప్రాంతం వద్ద ప్రైవేటు రాళ్ళ క్వారీలో బండ రాళ్లు విరిగిపడటంతో ఎరయూరు గ్రామానికి చెందిన ఇద్దరు ఘటనాస్థలంలోనే మృతి కనీస మద్దతు ధరకు చట్ట బద్ధత కల్పించాలన్న డిమాండ్‌తో దేశ రాజధాని ఢిల్లీలో రైతులు చేపట్టిన ఆందోళనకు రాష్ట్రంలోనూ విశేష మద్దతు లభించింది. వారికి మద్దతుగా వివిధ కార్మిక సంఘాల సమాఖ్య చెన్నైలో భారీస్థాయిలో ఆందోళన చేశారు. అన్నాసాలైలో ధర్నాకు దిగారు. దీంతో పోలీసులు ఏకంగా 800 మందిని అరెస్టు చేశారు.
- తిరువళ్లూరు జిల్లా మీంజూరు సమీపంలో సంభవించిన రోడ్డు ప్రమాదంలో అన్నాడీఎంకే మాజీ ఎమ్మెల్యే రవికుమార్ మృతిచెందారు.
- మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ హత్య కేసు ముద్దాయి శాంతను (56) అనారోగ్యంతో చెన్నైలోని రాజీవ్‌గాంధీ ప్రభుత్వాసుపత్రిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

మార్చి


బృహదీశ్వర ఆలయ కందకంలో సంభవించిన మంటలు



రీల్స్ కోసం సాహసం చెరువు నీటిపై మంటల నడుమ దూకుతున్న యువకుడు

- తిరుచ్చి విమానాశ్రయంలో ఒక ప్రయాణికుడు బంగారాన్ని పేస్ట్ (జెల్) రూపంలోకి మార్చి అక్రమంగా తీసుకొచ్చినట్టు గుర్తించిన కస్టమ్స్ అధికారులు అతనిని అరెస్ట్ చేశారు.
- చెంగల్పట్టు మణియక్కార వీధిలోని ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి బీహార్‌కు చెందిన దంపతుల సహా కుమార్తెలు మృతి చెందారు పుదుచ్చేరిలో ఇంటి ముందు ఆడుకుంటున్న తొమ్మిదేళ్ల బాలిక ఆరతిని కిడ్నాప్ చేసి సామూహిక అత్యాచారానికి పాల్పడి ఆమెకు నిప్పంటించి దారుణంగా హత మార్చి మృతదేహాన్ని మురికికాల్వలో పడవేసిన కిరాతకులైన ఐదుగురు బాలురు సహా ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు.


కూలిన పై కప్పు

- తంజావూరులో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బృహదీశ్వరాలయ కందకంలో గురువారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. అదేవిధంగా కుంభకోణం సమీపం తిరువిడైమరుదూర్ వద్ద వాహనతనిఖీలు చేపట్టిన అధికారులు 9 పంచలోహ విగ్రహాలను స్వాధీనం చేసుకున్నారు.


పంట పొలాల్లో దిగి ఆందోళనలో గ్రామస్తులు

- పరందూర్ విమానాశ్రయ ఏర్పాటుకు పంట పొలాలు స్వాధీనం చేసుకోవడాన్ని నిరసిస్తూ, రైతులు, ప్రజలు పంట పొలాల్లో దిగి 600వ రోజుగా ఆందోళనలు చేపట్టారు.
- చెన్నై విమానాశ్రయంలో మలేసియా నుంచి అక్రమంగా తరలిస్తున్న అరుదైన నాలుగు తెల్లచిలుకలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.
- చెన్నై ఆళ్వార్‌పేట సేమియర్స్ రోడ్డు సమీపంలోని ఓ ప్రైవేటు పబ్ పైకప్పు కూలిన ఘటనలో మద్యం బార్ ఉద్యోగి సైక్లోన్ రాజ్ సహా ఇద్దరు మృతిచెందారు.

ఏప్రిల్


ప్రమాద స్థలంలో శిథిలాలను తొలగిస్తున్న కార్మికులు

- పుదుచ్చేరి మరపాలం ప్రాంతం వద్ద మురుగునీటి కాల్వ పూడికతీత పనుల సందర్భంగా విద్యుత్ బోర్డు కార్యాలయం ప్రహరీ పడటంతో ఐదుగురు దుర్మరణం చెందారు.
- తిరుప్పూర్ జిల్లా వెల్లకోయిల్ సమీపంలో ప్రభుత్వ బస్సు, కారు ఢీకొన్న ఘటనలో తిరుప్పూర్ నల్లిగౌండన్‌నగర్ పుదునగర్‌కు చెందిన చంద్రశేఖరన్ సహా ఐదుగురు మృతిచెందారు.
- విరుదునగర్ జిల్లా రాజపాళయం సమీపం దళవాయిపురంలో జరిగిన కారు ప్రమాదంలో ఐదుగురు మృతిచెందారు.
- కోయంబత్తూరు జిల్లాలోని వెళ్ళియంగిరిపై ట్రెక్కింగ్‌కు వెళ్ళిన వారిలో ఇప్పటివరకు తొమ్మిది మంది మృతి చెందారు.


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

మే


బోల్తా పడిన బస్సు

- కళాశాల విద్యార్థినులకు మాయమాటలు చెప్పి, వారిని వ్యభిచారం కూపంలోకి నెట్టేందుకు ప్రయత్నించారంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రైవేటు కళాశాల ప్రొఫెసర్ నిర్మాలాదేవికి శ్రీవిల్లిపుత్తూర్‌లోని జిల్లా ఫాస్ట్ ట్రాక్ మహిళా కోర్టు పదేళ్ల జైలు శిక్ష, రూ.2.45 లక్షల జరిమానా విధించింది.
- ఏర్కాడులో ఆమ్నీ బస్సు అదుపుతప్పి లోయలో పడగానలుగురు మృతిచెందగా, 30 మందికి గాయాలయ్యాయి.
- విరుదునగర్ జిల్లాలోని రాళ్ల క్వారీ గోడౌన్‌లో ఉంచిన పేలుడు పదార్థాలు హఠాత్తుగా పేలడంతో నలుగురు మృతిచెందగా, మరో 12 మందికి గాయాలయ్యాయి.
- చెంగల్పట్టు జిల్లా మరమలైనగర్ సమీపంలో ఒకే ట్రాక్‌పై నాలుగు సబర్బన్ రైళ్లు ఒకదాని వెనుక ఒకటి అతి దగ్గరగా వచ్చి ఆగిన సంఘటన కలకలం రేపింది. సాంకేతికలోపం వల్ల సిగ్నల్ పనిచేయకపోవడంతో ఈ తప్పిదం జరిగిందని రైల్వే భద్రతా విభాగం అధికారులు తెలిపారు.


సీసీ టీవీలో నమోదైన పేలుడు దృశ్యం

జూన్

- సేలం జిల్లా కక్కపట్టి వద్ద రెండు బైకులను ఆమ్నీ బస్సు ఢీకొన్న దుర్ఘటనలో పసికందు సహా నలుగురు మరణించారు.
- పుదుచ్చేరి రెడ్డియార్ పాళయం పుదునగర్ ప్రాంతంలో మురుగు నీటి కాలువ నుండి వ్యాపించిన విషవాయువు సోకి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో మృతి చెందారు.
- విరుదునగర్ జిల్లాలో బాణసంచా కర్మాగారంలో సంభవించిన పేలుడులో నలుగురు మరణించగా, మరికొందరికి గాయాలయ్యాయి.


పేలుడులో ధ్వంసమైన గదులు

జూలై

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్‌ను పెరంబూర్‌లో గుర్తుతెలియని వ్యక్తులు మారణాయుధాలతో దారుణంగా హతమార్చారు.
- రాజధాని నగరంలో మళ్లీ 'రూట్ తల' వ్యవహారం వివాదాస్పదమైంది. ఎంటీసీ బస్సు టాపుపై కూర్చొని అట్టహాసం చేసిన వీడియో దృశ్యాలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి.
- కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఎలాంటి చర్చలకు తావులేకుండా, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా మూడు కొత్త క్రిమినల్ చట్టాలను అమల్లోకి తెచ్చినందుకు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ కన్నియాకుమారి జిల్లా నాగర్‌కోయిల్ న్యాయవాదులు రాస్తారోకో నిర్వహించారు.
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్‌ను హత్య కేసు నిందితుడు తిరువేంగడం పోలీసులు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు.
- చెన్నై విమానాశ్రయంలో హఠాత్తుగా ఉగ్రవాదులు విమానాన్ని హైజాక్ చేస్తే, దానిని అడ్డుకోవడం తదితరాలపై మాక్ డ్రిల్ నిర్వహించారు.


రైల్వేస్టేషన్‌లోకి చొచ్చుకు వెళుతున్న న్యాయవాదులు

ఆగస్టు


పోలీసుల కాల్పుల్లో గాయపడిన రౌడీ సెల్వం

- కన్నియాకుమారి జిల్లాలో రౌడీ సెల్వం, ఎస్ఐపై వేటకొడవలితో దాడి జరిపి పారిపోయేందుకు ప్రయత్నించడంతో కాల్పులు జరిపి అతడిని నిర్బంధించారు.
- కృష్ణగిరి జిల్లా, బర్గూర్ సమీపంలో ఒక ప్రైవేటు పాఠశాల విద్యార్థినులకు నకిలీ ఎన్‌సీసీ క్యాంపులు జరిపి వారిపై అత్యాచారాలకు పాల్పడిన కేసులో ప్రధాన నిందితుడైన నామ్ తమిళర్ కట్చి మాజీ నిర్వాహకుడు శివ రామన్, ఆయన తండ్రి అశోక్‌కుమార్ కొన్ని కొన్ని గంటల తేడాతో ప్రాణాలు కోల్పోయారు.
- అమెరికా పర్యటనకు భార్య సహా ముఖ్యమంత్రి స్టాలిన్ బయలుదేరగా, దుబాయ్ వెళ్లిన విమానానికి బాంబు బెదిరింపు రావటంతో భద్రతదళం అధికారులు, సిబ్బంది రాత్రంతా తనిఖీలతో జాగారం చేశారు.

సెప్టెంబరు


లేడీస్ హాస్టల్‌లో మంటలు అదుపుచేస్తున్న సిబ్బంది

- నగరంలోని ఐలాండ్ గ్రౌండ్‌లో కార్ రేసు ప్రాంతంలో బందోబస్తులో ఉన్న కొళత్తూరు ఏసీపీ శివకుమార్ హఠాత్తుగా మృతి చెందారు.
- అన్నానగర్‌లోని కందస్వామి ఆర్ట్స్ కళాశాలలో బీకాం చదువుతున్న 17 మంది విద్యార్థులు సముద్రతీరంలో స్నానం చేస్తుండగా అలలతాకిడికి గురై ముగ్గురు మృతిచెందారు.
- స్థానిక సచివాలయం సహా నగరంలోని మూడు ప్రైవేటు పాఠశాలలను బాంబు దాడిలో పేల్చివేస్తామని వచ్చిన బెదిరింపు లేఖతో నగర పోలీసులు అప్రమత్తమయ్యారు.
- వ్యాసార్పాడి బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్ ప్రాంతంలో జరిపిన ఎన్‌కౌంటర్‌లో రౌడీ కాక్కాతోప్పు బాలాజీ హతమయ్యాడు.
- శివగంగ జిల్లా ఇనయాంకుడి నగర్‌లో సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేస్తున్న ఇద్దరు కార్మికులు విషవాయువు సోకి మృతిచెందారు.

అక్టోబరు

- చెన్నై మెరీనా సముద్ర తీరంలో భారత వైమానిక దళం విన్యాసాల్లో అపశ్రుతి చోటచేసుకుంది. ఆ విన్యాసాలను తిలకిస్తూ తీవ్ర అస్వస్థతకు గురైన ఐదుగురు మృతిచెందారు.
- తిరుచ్చి జిల్లా సమయపురం మారియమ్మన్ ఆలయ తీర్థకొలనులో గుర్తు తెలియని ఇద్దరి మృత దేహాలు పడి ఉండగా పోలీసులు కనుగొన్నారు. ఈ కొలనులో భక్తులను స్నానాలకు అనుమతించరు.


తిరుచ్చి విమానాశ్రయం వద్ద సిద్ధంగా అంబులెన్స్, సిబ్బంది


ఎయిర్ షోకు చూసేందుకు తరలివచ్చిన ప్రజలు

నవంబరు

- స్థానిక మీనాంబాక్కం అంతర్జాతీయ విమానాశ్రయంలో థాయ్‌లాండ్‌నుంచి అక్రమంగా తరలించిన 453 నక్షత్ర తాబేళ్లను కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.
- నాగపట్టణం సమీపంలో ప్రభుత్వ బస్సు డ్రైవర్ శక్తివేల్ సెల్‌ఫోన్ చూస్తూ బస్సు నడుపుతుండడంతో రవాణా శాఖ అధికారులు సస్పెండ్ చేశారు.
- మదురై కీలవాసల్ ప్రాంతంలో ఉన్న సీఎస్ఐ చర్చిలో ప్రార్థనా సమయంలో ఇరువర్గాల మధ్య వివాదం చెలరేగి తోపులాటకు దారితీసింది.
- తిరువొత్తియూరు గ్రామవీధిలోని విక్టరీ మెట్రిక్యులేషన్ ప్రైవేటు పాఠశాలలో గ్యాస్‌ను పీల్చిన నలుగురు విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సింగపూర్‌కు బయలుదేరి వెళ్ళాల్సిన ఎయిరిండియా విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో విమానాన్ని నిలిపివేసి ప్రయాణికులను కిందికు దించేశారు.
- చెన్నై గిండీ కలైంజర్ శతజయంతి స్మారక ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో క్యాన్సర్ చికిత్సా విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ బాలాజీ జగన్నాథన్‌పై ఓ యువకుడు కత్తితో దాడికి పాల్పడ్డాడు.
- తంజావూరు జిల్లా మల్లిపట్టినం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తమిళ ఉపాధ్యాయురాలిని తన ప్రేమను అంగీకరించలేదన్న కోపంతో ఓ యువకుడు కత్తితో దాడి హత్యచేసిన సంఘటన రాష్ట్ర వ్యాప్తంగాకలకలం రేపింది. తిరుప్పూర్ జిల్లా సేలమ్మైగౌండన్‌పాళయం గ్రామంలో వృద్ధ దంపతులు మామిడి తోటలో విగత జీవులుగా పడి ఉండగా స్థానికులు కనుగొన్నారు.

కల్తీసారాకు 70 మంది మృతి

కళ్లకుర్చి జిల్లాలో కల్తీసారా తాగి సుమారు 70 మంది మృతిచెందగా, చికిత్సలు పొందిన మరో వంద మంది ఆసుపత్రి నుంచి డిశ్చార్జీ అయ్యారు. తొలుత కల్తీసారా తాగిన ముగ్గురు యువకులు మృతి చెందారు. ఆ ముగ్గురు కల్తీ సారా తాగి మృతి చెందలేదని జిల్లా కలెక్టర్ తప్పుడు సమాచారంతో ప్రకటన చేయడంతో ఆ ముగ్గురి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వెళ్ళినవారంతా శోకాన్ని భరించలేక, మళ్లీ అదే కల్తీసారా తాగి వరుసగా మృత్యువాత పడ్డారు.



కళ్లకుర్చి నకిలీ సారా మృతులకు ఒకే ప్రాంతంలో అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

డిసెంబరు



'ఫెంగల్' తుఫాను కారణంగా కృష్ణగిరి జిల్లాలో సంభవించిన వరదలకు కొట్టుకుపోతున్న వాహనాలు - తిరువణ్ణామలైలో జరిగిన ఘటనలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు యత్నిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బలగాలు

జలదిగ్బంధంలో చెన్నై మౌంట్ రోడ్డు


'ఫెంగల్' తుఫానుకు నీటమునిగిన విల్లుపురం బస్టాండ్

- సుప్రసిద్ధ శైవక్షేత్రమైన తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయం వెనుకనున్న పర్వతం నుంచి మట్టిపెళ్లలు విరిగి పడిన ఘటనలో ఇల్లు ధ్వంసమై అందులో నివసిస్తున్న ఏడుగురు దుర్మరణం చెందారు.
- తిరువణ్ణామలై గిరిప్రదక్షిణ మార్గంలోని విడిదిగృహంలో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు.

'ఫెంగల్' తుఫాన్...

రాష్ట్రంలో ఈ ఏడాది చివరలో ఏర్పడిన ఫెంగల్ తుఫాన్ కారణంగా భారీవర్షాలతో సుమారు 50 మందికి పైగా మృతిచెందారు. వేలాది ఎకరాల్లో పంటలు నాశనం కాగా, పశువులు, కోళ్ల వరదల్లో కొట్టుకుపోయాయి. విల్లుపురం, కడలూరు సహా పలు జిల్లాలు తీవ్రనష్టం చవిచూశాయి. నగరంలో ముంపుకు గురైన ప్రాంతాల్లో చిక్కుకున్న వారికి రక్షించేందుకు పడవలు వినియోగించారు. వర్షాలకు ముందే ముంపు ప్రాంతాల్లో పడవలు ఉంచడంతో, బాధితులను సత్వరం వెలికితీసుకువచ్చేందుకు ఉపయోగపడింది.